క్లుప్తంగా

చిన్నారులకు పోలియో చుక్కలు



పెండ్యాల(కంచికచర్ల): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మాట్లాడుతూ ప్రతి తల్లి తమ బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో నివారణ కోసం ప్రభుత్వం వ్యాక్సిన్ అందిస్తుందని తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ మొదులుకొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కాజ్‌వేకు మరమ్మతు పనులు



లింగాల(వత్సవాయి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మునేటికి వరదతాకిడి పోటెత్తింది. మునేటికి ఎగువ ప్రాంతాలైన వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. మూడు రోజులపాటు కాజ్‌వే పైనుంచి వరదనీరు పారింది. దీంతో కాజ్‌వే పలుచోట్ల దెబ్బతింది. కాజ్‌వేపై గతంలో వేసిన సిమెంట్ రహదారి మొత్తం చెక్కలుగా లేచిపోయింది. దీంతో గత పదిహేను రోజులనుంచి కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు కాజ్‌వే మరమ్మతు పనులను చేపట్టారు. కాజ్‌వేపై దెబ్బతిన్న ప్రాంతాల వద్ద జేసీబీతో చదును చేస్తున్నారు. త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఉదయభాను ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

నందిగామ: మండల పరిధిలో 2022–23 వ సంవత్సరంలో నిర్వహించిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15 వ విడత పనులకు సంబంధించి మంగళవారం నందిగామ పట్టణంలోని ఉపాధి హామీ పథక కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన 2168 రకాల పనులకు అందించిన 12.34 కోట్ల రూపాయలకు సంబంధించి ప్రజా వేదికలో భాగంగా ఆడిట్ నిర్వహించారు. పలు అంశాలపై అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత, జిల్లా విజిలెన్స్ అధికారి వి.విజయలక్ష్మి, ఏపీడీ మణికుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఓ శరత్‌బాబు పాల్గొన్నారు.

108 సర్వీసెస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్



నందిగామ: 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నందిగామకు చెందిన జిల్లేపల్లి యుగంధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం మైలవరంలో జరిగింది. సమావేశం అనంతరం ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సమాఖ్య భవనం ఏర్పాటుకు కలెక్టర్‌కు వినతి




రావిరాల(జగ్గయ్యపేట): వత్సవాయి మండలంలో మహిళా సమాఖ్య భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ మండలానికి చెందిన మహిళా సమాఖ్య సభ్యులు మంగళవారం కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందించారు. ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొన్న ఆయన్ను మండల సమాఖ్య అధ్యక్షురాలు శిరీష కలసి సమాఖ్య సమావేశాలు, ఇతర ప్రభుత్వ సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రూ.30 లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

చెస్‌లో ప్రతిభ చూపిన గీతిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 5, 6 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన లీలావతి మెమోరియల్ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన పూడి గీతిక ప్రతిభ కనబర్చింది. అండర్–9 విభాగంలో జరిగిన పోటీల్లో మొదటి స్థానం సాధించి పసిడి పతకాన్ని సాధించింది. కోచ్ అవ్వారు రామకృష్ణ, ఏపీ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సీనియర్ సేల్స్ మెన్ మీసాల సింహాచలం తదితరులు సింగ్‌నగర్‌లోని తమ అకాడమీలో గీతికను మంగళవారం అభినందించారు.

పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం మెండు

- జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- ఉద్యోగాలలో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను సూచన



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్

రావిరాల(జగ్గయ్యపేట): పరిశ్రమలను ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మండలంలోని జయంతిపురం శివారు గ్రామం రావిరాలలో రామ్‌కో సిమెంట్స్ ప్లాంట్ కోసం 0.115 మెట్రిక్ టన్నుల సున్నపురాయి గని ఉత్పత్తి నిమిత్తం మంగళవారం గని ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం వారు సున్నపు రాయి ఉత్పత్తి కోసం పెట్టుకున్న అర్జీపై ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించటమే కాకుండా స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగావకాశాలలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. చట్టానికి లోబడి యాజమాన్యాలు స్థానిక నిరుద్యోగులకు అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పించాలని తెలిపారు. అంతే కాకుండా వాయు కాలుష్యం, తాగునీరు, తదితరాలకు ఇబ్బందులు లేకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని కర్మాగార యాజమాన్యాలు స్థానిక నిరుద్యోగులకు అన్ని అర్హతలున్నా ఉద్యోగాలు ఇచ్చేందుకు పలు ఆంక్షలు విధిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యాలు స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. రామ్‌కో సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తుండటం హర్షణీయమన్నారు. మైన్స్ సమీపంలో పొలాలు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు పడకుండా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ కృష్ణానదికి వరదల సమయంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కృష్ణానదిలో ప్రత్యేక బోరు తీయించాలని సూచించారు. అనంతరం పలువురు గ్రామస్తులు, పర్యావరణ పరిరక్షణ ప్రతినిధుల అభిప్రాయాలను కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై రామ్‌కో ప్రెసిడెంట్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తహసీల్దార్ చిన్నారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఏబీసీ టెక్నో ల్యాబ్స్ ఇండియా ప్రతినిధులు, పలు గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: వర్షా కాలం నేపథ్యంలో పారిశుద్ధ్య మెరుగుదలకు పెద్ద పీట వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని రెండవ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రెయిన్లలో పూడిక తీత, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు, అవసరమైన చోట్ల బ్లీచింగ్ చల్లించడం, కంప చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించడం, దోమల నిర్మూలనకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తానూరి రాము, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

నందిగామ: మహిళల ఆర్థిక అభివృద్ధికి టైలరింగ్ ఎంతగానో ఉపకరిస్తుందని మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన శ్రీ మాతృశ్రీ మహిళా మండలి ఆధ్వర్యంలో మండలంలోని మాగల్లు గ్రామంలో 60 రోజులపాటు నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 రోజులపాటు గ్రామానికి చెందిన 30 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు రాజ్యలక్ష్మి, గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తరలించడానికి సిద్ధం చేసిన గోడౌన్‌పై జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేశారు. రామరాజ్యనగర్‌లోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు జేసీకి సమాచారం అందింది. జేసీ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి గోడౌన్‌పై దాడి చేశారు. సుమారు 232 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పెంకే రాంబాబు అనే వ్యక్తితో పాటు లారీ యజమాని బాలస్వామిను అదుపులోకి తీసుకుని వారిపై 6–ఏ కేసు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

జగన్ పాలన చూసి వైఎస్సార్ సీపీలోకి వలసలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఉదయభాను

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన పలువురు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఉదయభాను నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వత్సవాయి మండలం, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన గుడేటి మనోజ్‌కుమార్, బొప్పిడి అరుణ్‌కుమార్ తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆదర్శ పాలనకు మెచ్చి ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బజారు సాయి, నాయకులు కటికోల ఇశ్రాయేలు, పొన్నగంటి నాయుడు, మాతంగి నాగబాబు, గొర్రెపాటి సుదర్శన్, పాము అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ



నందిగామ: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను నిరసిస్తూ మంగళవారం రాత్రి నందిగామ పట్టణంలో పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ప్రజా గాయకుడు గద్దర్‌కు కూడా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో దిశ సొసైటీ, స్నేహ క్లబ్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో హైవే బస్టాండ్ నిర్మాణం

ప్రభుత్వ విప్ ఉదయభాను



హైవే బస్టాండ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజల సౌకర్యార్థం త్వరలో 65 వ నంబర్ జాతీయ రహదారిపై హైవే బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం హైవే బస్టాండ్ నిర్మించనున్న స్థలం చదును పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణం అభివృద్ధి చెందాలంటే పక్కన ఉన్న కోదాడ, నందిగామ పట్టణాల్లో వలే హైవేపైనే బస్టాండ్ ఉండాలని, అప్పుడే పట్టణం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకే కోటి రూపాయల వ్యయంతో హైవే బస్టాండ్ నిర్మిస్తున్నామన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

పర్యాటక కేంద్రంగా రూపొందుతున్న చెరువు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా పేట ఊర చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చెరువు చుట్టూ ప్రహరీ, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ఎర్రకాలువ, వేపలవాగు పూడికతీత పనుల పరిశీలన

పట్టణంలోని ఎర్రకాలువ, వేపలవాగు పూడిక తీత పనులను ఎమ్మెల్యే ఉదయభాను పరిశీలించారు. రూ.40 లక్షల వ్యయంతో పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కౌన్సిలర్ కొలగాని రాము, తన్నీరు నాగేంద్ర, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు మోరె వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటపై అవగాహన సదస్సు

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ గరికపాడు కేవీకే ఆధ్వర్యంలో పత్తి సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త లక్ష్మీకళ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే పత్తిలో మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసం పీల్చే పురుగు, గులాబీ రంగు పురుగు నిర్ధారణకు రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటించి పురుగు నియంత్రణ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లూర్దుమేరి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రాకేష్, రైతులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు సహకరించాలి

ఆర్డీఓ రవీంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా బీఎల్ఓలు ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అందరి సహకారంతోనే నాణ్యమైన ఓటరు జాబితా సిద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో పోస్టర్ ఆవిష్కరణ

కంచికచర్ల: విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12న విజయవాడలో తలపెట్టిన సామూహిక నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ సెక్రటరీ వేముల భిక్షమయ్య అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయం ఆవరణలో మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ఉమ్మడి సర్వీస్ నిబంధనలను అమలు చేసి జోనల్ విధానం ద్వారా పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు విక్టర్ నగేష్, అంజిరెడ్డి, సురేష్‌బాబు, శ్రీరామమూర్తి, యూటీఎఫ్ నాయకులు కోపూరు నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ నాయకులు మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

వత్సవాయి: ఉపాధ్యాయులకు ముఖ ఆధారిత హాజరులో ఉన్న లోపాలను సరిచేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు పీడీవీ ప్రసాదరావు తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, వేతనాలు వెంటనే చెల్లించాలని, బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయుల వేతనాలను త్వరితగతిన చెల్లించాలని తెలిపారు.

సాహసోపేత నిర్ణయాలతో సంక్షేమ పాలన

అల్లూరులో గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించటంతో పాటు సాహసోపేత నిర్ణయాలతో గత ప్రభుత్వాలకు భిన్నంగా పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టటమే కాకుండా అర్హులందరికీ సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్ రెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



పశువులకు చికిత్సలు అందిస్తున్న పశువైద్యులు

నవాబుపేట(పెనుగంచిప్రోలు): పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు జశ్వంత్‌రెడ్డి, అర్చన అన్నారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్, గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు ఎద పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించారు. గర్భకోశవ్యాధులు, తిరగకట్టటం, మూగ ఎద, చర్మవ్యాధులు, జ్వరం, పుండ్లు, గాయాలు, తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన పశువులకు కృత్రిమ గర్భధారణ అందించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఆరోగ్యంతో పాటు నాణ్యమైన పాల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె.లక్ష్మీకళ, ఎస్.రాజశేఖర్, పశువైద్యుడు అనిల్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వీరభద్రం, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నందిగామ బార్ అసోసియేషన్ నాయకులు

నందిగామ: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి అరుణ సారికను మంగళవారం నందిగామ బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని న్యాయమూర్తి చాంబర్ లో కలిసిన న్యాయవాదులు నందిగామలో నిర్మిస్తున్న కోర్టు భవనాలు దాదాపు పూర్తికావస్తున్న నేపథ్యంలో మరికొన్ని అంశాలపై న్యాయమూర్తికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఫర్నిచర్, అంతర్గత రహదారులు మొదలైన వాటి గురించి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండి మల్లికార్జునరావు, పి.ప్రకాష్, న్యాయవాదులు ఈశ్వరప్రగడ రంగారావు, మన్యం నారాయణరావు ఉన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నామినేషన్లు ప్రారంభం



ఎన్నికల నిబంధనలు నోటీస్ బోర్డులో చూపుతున్న అధికారులు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులు మరణించటం, ఇతర కారణాలతో ఈ ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో జగ్గయ్యపేట మండలం మల్కాపురంలో ఆంబోజు మణి, వత్సవాయి మండలంలో పెదమోదుగుపల్లి సర్పంచ్ కల్యాణం తేజశ్రీ మృతి చెందటంతో అక్కడ ఉప ఎన్నిక జరగనుంది. పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలులో 6వ వార్డు, లింగగూడెంలో 2వ వార్డు, వత్సవాయి మండలంలో శింగవరం 6వ వార్డుకు ఉప ఎన్నిక జరగనుంది. నామినేషన్ల ప్రక్రియ ఈనెల 10 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పూర్తవుతుందని ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ అన్నారు. ఆగస్టు 11న స్క్రూటినీ, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్, అనంతరం ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు.

నేడు 'ఆహారంతో ఆరోగ్యం'పై సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం మనం తినే ఆహారంతోనే ఆరోగ్యం పొందడం ఎలా అనే అంశంపై బుధవారం ఉదయం 11 గంటలకు రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు జరుగుతుందని జనశిక్షణసంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ తెలిపారు. సీనియర్ వెల్‌నెస్ కోచ్‌లు కె.వి. నాగరాజు, కె.హరిత, జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా సదస్సులో పాల్గొంటారు.

రాజన్న ఉచిత భోజనానికి వెల్లువెత్తిన పేదలు



పట్టణంలో రాజన్న ఉచిత భోజనం కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు వైఎస్సార్ సీపీ నాయకుడు జీవీడీ ప్రసాద్ కుమారుడు గంటా మురళీమోహన్ జన్మదినం సందర్భంగా అన్నప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి పేదలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సుమారు 700 మంది అన్నప్రసాదం స్వీకరించారు. –జగ్గయ్యపేట అర్బన్